సాక్షి
కుమురం భీం
శనివారం । 17 । మే । 2025



చిన్నయ్య గుట్టను చూసొద్దాం

లక్సెట్టిపేట మండలం చల్లంపేట శివారు అటవీప్రాంతంలో చిన్నయ్యగుట్టపై చిన్నయ్య దేవుడు కొలువై ఉన్నాడు. గిరిజనుల ఆరాధ్య దైవంగా వెలుగొందుతున్నాడు. IIలో▸



ఫైర్‌స్టేషన్‌కు మోక్షమెప్పుడో!

కెరమెరి మండలంలో అగ్నిమాపక కేంద్రం లేక అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు తీవ్ర నష్టం వాటిల్లుతోంది. ఫైరింజన్ వచ్చేలోపే ఆస్తులు అగ్ని ఆహుతవుతున్నాయి. IIIలో▸

గరిష్టం/కనిష్టం
36.0 /26.0

వాతావరణం

ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గుతాయి.ఆకాశం మేఘావృతమవుతుంది. అక్కడక్కడా చిన్నపాటి వర్షం కురిసే అవకాశముంది.

న్యూస్‌రీల్

హైలెవల్ వంతెన.. అసెంబ్లీలో ప్రస్తావన

దహెగాం: దహెగాం, పెంచికల్‌పేట్ మండలాల మధ్యనున్న పెద్దవాగు సమీపంలో మరో చిన్న ఒర్రెపై హైలెవల్ వంతెన నిర్మాణానికి ఏడు నెలల క్రితం సీఆర్ఐఎఫ్ కింద రూ.18కోట్లు మంజూరు కాగా, శుక్రవారం సాక్షిలో 'పెండింగ్‌లో హైలెవల్ వంతెన పనులు' పేరిట కథనం ప్రచురితమైంది. శుక్రవారం రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సీతక్క జిల్లా పర్యటనలో భాగంగా పెంచికల్‌పేట్ మండల కేంద్రంలో భూభారతి చట్టంపై నిర్వహించిన అవగాహన సదస్సుకు హాజరయ్యారు. ఈ అవగాహన సదస్సుకు సిర్పూర్ (టీ) ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు హాజరై మాట్లాడారు. కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని ఒప్పించి హైలెవల్ వంతెన నిర్మాణానికి రూ.18 కోట్లు మంజూరు చేయించినట్లు చెప్పారు. 'సాక్షి' కథనాన్ని ప్రస్తావించారు. హైలెవల్ వంతెన నిర్మాణానికి రెవెన్యూ అధికారులు భూ సేకరణ చేయడంలో జాప్యం చేస్తున్నారని సభలో మంత్రుల దృష్టికి తీసుకెళ్లారు. రెవెన్యూ అధికారులు అవినీతిలో కూరుకుపోయారని విమర్శించారు. అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని పేర్కొన్నారు.

లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న న్యాయమూర్తి రమేశ్

ఆసిఫాబాద్‌రూరల్: జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ ఎంవీ రమేశ్ కోరారు. శుక్రవారం న్యాయ స్థానంలో న్యాయవాదులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వచ్చే నెల 14న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌కు అధికసంఖ్యలో రాజీ కేసులు వచ్చేలా చూడాలని సూచించారు. జాతీయ లోక్ అదాలత్‌లో రాజీపడే క్రిమినల్, సివిల్, భూతగాదా కేసులు లాంటివి రాజీపడదగు కేసులు పరిష్కరించనున్నట్లు తెలిపారు. కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి యువరాజ, జూనియర్ సివి ల్ జడ్జి అనంతలక్ష్మి, అడ్వకేట్ పాల్గొన్నారు.

ముగిసిన వేసవి క్రీడా శిక్షణ



మాట్లాడుతున్న డీఎస్వో మీనారెడ్డి

ఆసిఫాబాద్‌రూరల్: క్రీడలు విద్యార్థులకు ఎంతో ఉపయోగపడతాయని డీఎస్వో మీనారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని గిరిజన ఆదర్శ క్రీడా పాఠశాలలో నిర్వహించిన వేసవి క్రీడా శిక్షణ ముగింపు కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. గిరిజన సంక్షేమ శాఖ అధ్వర్యంలో 15 రోజుల పాటు మంచిర్యాల, ఆసిఫాబాద్ గిరిజన పాఠశాలల విద్యార్థులకు క్రీడా పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. వేసవి క్రీడా పోటీలకు 120 మంది క్రీడాకారులకు అథ్లెటిక్స్, హ్యాండ్‌బాల్, ఖోఖో, వాలీబాల్, కబడ్డీ, చెస్ పోటీలపై శిక్షణ ఇచ్చినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో అథ్లెటిక్స్ కోచ్ విద్యాసాగర్, కబడ్డీ కోచ్ తిరుమల్, హ్యాండ్‌బాల్ కోచ్ అరవింద్, పీడీ, పీఈటీలు లక్ష్మణ్, శ్రీను, రవీందర్ పాల్గొన్నారు.

ఫిట్‌నెస్ లేని వాహనాలపై చర్యలు తీసుకోవాలి



రామచందర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఆసిఫాబాద్‌రూరల్: ఫిట్‌నెస్ లేని బస్సులు నడుపుతున్న పాఠశాల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని శుక్రవారం ఆర్టీవో రాంచందర్‌కు జిల్లా కేంద్రంలో జాతీయ మానవ హక్కుల కమిటీ ఆధ్వర్యంలో వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు రమేశ్ మాట్లాడారు. జిల్లాలో ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు ఫిట్‌నెస్ లేని బస్సులు నడుపుతున్నారని తెలిపారు. వాటిని గుర్తించి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. సీటింగ్ కెపాసిటికి మించి విద్యార్థులను వాహనాల్లో తీసుకువెళ్లకుండా చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో సంఘం కన్వీనర్ మహేశ్ తదితరులున్నారు.



మాట్లాడుతున్న మంత్రి శ్రీనివాస్‌రెడ్డి, పక్కన మంత్రి సీతక్క, ఎమ్మెల్యే హరీశ్‌బాబు, ఎమ్మెల్సీ విఠల్, కలెక్టర్ వెంకటేశ్ దోత్రే

భూ భారతితో
రైతులకు మేలు

- రాష్ట్ర మంత్రులు పొంగులేటి, సీతక్క
- పెంచికల్‌పేట్ మండల కేంద్రంలో 'భూ భారతి'పై అవగాహన సదస్సు

పెంచికల్‌పేట్: భూ భారతి చట్టంతో రైతులకు మేలు జరుగుతుందని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన భూ భారతి అవగాహన సదస్సుకు పంచాయతీరాజ్, శిశుసంక్షేమ శాఖ మంత్రి సీతక్కతో కలిసి హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ.. 18 రాష్ట్రాల్లో అమలు చేస్తున్న చట్టాలను పరిశీలించి భూ భారతి చట్టాన్ని రూపొందించామని తెలిపారు. జూన్ 2నుంచి రాష్ట్రంలో 10,956 గ్రామాల్లో భూ భారతిని అమలు చేస్తామని చెప్పారు. రైతుల సమస్యలు తెలుసుకోవడానికి రెవెన్యూ అధికారులు గ్రామాలకు వస్తారని తెలిపారు. రెండు రోజుల్లో భూ భారతి సమస్యలపై ఫిర్యాదు చేయటానికి టోల్ ఫ్రీ నంబర్‌ను అందుబాటులోకి తెస్తామని పేర్కొన్నారు. భూ భారతి చట్టం అమలులో నిర్లక్ష్యం వహించే అధికారులపై చర్యలకు ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. రెవెన్యూ, అటవీశాఖల మధ్య ఉన్న భూముల్లో సర్వే నిర్వహించి సమస్య పరిష్కరించాలని ఇరు శాఖల అధికారులను ఆదేశించారు. రైతుల పంట పొలాలకు సాగునీరు అందించి వారి కళ్లలో ఆనందాన్ని చూడటమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని చెప్పారు. కలెక్టర్ వెంకటేశ్ దోత్రే మాట్లాడుతూ.. పెంచికల్‌పేట్ మండలాన్ని పైలెట్ మండలంగా ఎంపిక చేయగా ఆయా గ్రామాల్లో నిర్వహించిన రెవెన్యూ సదస్సుల ద్వారా భూ సంబంధిత సమస్యలపై 239 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. కార్యక్రమంలో జీసీసీ చైర్మన్ కొట్నాక తిరుపతి, రెవెన్యూ ప్రిన్సిపాల్ సెక్రటరీ నవీన్ మిట్టల్, అదనపు కలెక్టర్ దీపక్ తివారి, డేవిడ్, కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా, ఎస్సీ డీవీ శ్రీనివాసరావు, మాజీ కేంద్ర మంత్రి వేణుగోపాలాచారి, మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీశ్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు సముద్రాల సరితరాజన్న, కాంగ్రెస్ నాయకులు, అధికారులు, రైతులు పాల్గొన్నారు.

పోడు భూముల జోలికి వెళ్లొద్దు: మంత్రి సీతక్క



ప్రభుత్వం పేదలకు 20లక్షల ఇందిరమ్మ ఇళ్లు నిర్మించటమే ధ్యేయంగా నియోజకవర్గానికి 3,500 చొప్పున మంజూరు చేసిందని తెలిపారు. అటవీ భూముల పేరుతో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను అటవీశాఖ అధికారులు అడ్డుకోవడం సరికాదని పేర్కొన్నారు. గిరిజనులు ఏళ్లుగా సాగు చేసుకుంటున్న పోడు భూముల జోలికి వెళ్లొద్దని ఆదేశించారు. నియోజకవర్గంలో గిరి వికాస్ పథకంలో గిరిజనుల భూముల్లో ప్రభుత్వం బోర్లు వేసి సోలార్ విద్యుత్, మోటార్లను అందించి వారు ఆర్థికంగా ఎదిగేందుకు దోహదపడనున్నట్లు తెలిపారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో గ్రామాలు అభివృద్ధికి నోచుకోలేదని మంత్రి సీతక్క ఆరోపించారు.

'రెవెన్యూ'లో వసూళ్ల పర్వం: ఎమ్మెల్యే హరీశ్‌బాబు



రెవెన్యూ కార్యాలయానికి సర్టిఫికెట్ల కోసం వెళ్లే వారి నుంచి అధికారులు డబ్బులు వసూలు చేస్తున్నారని ఎమ్మెల్యే హరీశ్‌బాబు ఆరోపించారు. దిందా, కొండపల్లి గ్రామాల పోడు భూముల సమస్యలు పరిష్కరించాలని కోరారు. రిజర్వ్ ఫారెస్ట్ భూములున్న గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల పైలెట్ ప్రాజెక్ట్‌ను ప్రారంభించిన అధికారులపై చర్యలు తీసుకోవాలన్నారు. పెంచికల్‌పేట్ పెద్దవాగు అప్రోచ్ బ్రిడ్జి నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం రూ.18కోట్లు మంజూరు చేసినా రెవెన్యూ అధికారుల తీరుతో ఇప్పటికీ భూసేకరణ పూర్తి కాలేదని తెలిపారు. జిల్లాకు ఆనుకుని ప్రాణహిత ప్రవహిస్తున్నా చుక్కా సాగునీరు పొలాలకు అందడం లేదని తెలిపారు. కౌటాల మండల కేంద్రంలో కృషి విజ్ఞాన కేంద్రానికి ప్రభుత్వం భూమి కేటాయించాలని కోరారు.

పోడు సమస్య పరిష్కరించాలి: ఎమ్మెల్సీ విఠల్



హక్కు పట్టాలున్న భూముల్లో రైతులు సాగు చేసుకుంటుండగా పనులను వ్యవసాయశాఖ అధికారులు అడ్డుకుంటున్నారని ఎమ్మెల్సీ దండె విఠల్ తెలిపారు. నియోజకవర్గంలో రెవెన్యూ, అటవీశాఖ అధికారుల మధ్య వివాదాస్పదంగా ఉన్న భూముల్లో జాయింట్ సర్వే నిర్వహించి రైతులకు న్యాయం చేయాలని కోరారు. మారుమూల నియోజకవర్గానికి మరో 3,500 ఇళ్లు మంజూరు చేయాలని, పోడు రైతుల జోలికి వెళ్లకుండా అటవీశాఖ అధికారులను ఆదేశించాలని కోరారు.

సన్న బియ్యం.. పెద్ద దందా!



సిర్పూర్(టి)లో పోలీసులు పట్టుకున్న రేషన్ బియ్యం (ఫైల్)



కౌటాల మాజీ సర్పంచ్ వొజ్జల మౌనిశ్ ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన 13.40 క్వింటాళ్ల రేషన్ సన్నబియ్యాన్ని ఈ నెల 4న ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు పట్టుకున్నారు. బియ్యం విక్రయించిన షేక్ జైనొద్దీన్, పెరుగు ప్రభాకర్, పోతులవార్ తిరుపతి, గుర్లె విట్టుమేర, విలాస్, మనోహర్, కొనుగోలు చేసిన మాజీ సర్పంచ్ వొజ్జల మౌనిశ్‌పై 6ఏ కేసు నమోదు చేశారు. ఈ కేసులో ఎక్కువ మొత్తంలో సన్నబియ్యం పట్టుకున్నా తక్కువ బియ్యం పట్టుకున్నట్లు చూపించారనే ఆరోపణలున్నాయి. ఈ కేసు నమోదు అనంతరం ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు, నిందితులిచ్చిన విందులో పాల్గొన్నట్లు సమాచారం.

జిల్లాలో ప్రజాపంపిణీ వివరాలు
రేషన్ దుకాణాలు : 314
అంత్యోదయ కార్డులు : 12,948
తెల్లరేషన్ కార్డులు : 1.40లక్షలు
నెల బియ్యం కోటా : 3వేల మెట్రిక్ టన్నులు

- విక్రయిస్తున్న రేషన్ లబ్ధిదారులు
- కొత్త దందాకు దిగిన దళారులు
- పోలీసులకు పట్టుబడుతున్న వైనం

కౌటాల: పేదలకు నాణ్యమైన సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామని ప్రచారం చేసుకుంటున్న ప్రభుత్వం ఆ బియ్యం పక్కదారి పడుతుంటే ఏమీ చేయలేకపోతోంది. చాలామంది అనర్హుల కూ రేషన్ కార్డులుండడం, మరికొందరికి రేషన్ బియ్యం తినడం ఇష్టం లేక అమ్ముకుంటున్నారు. జిల్లాలో 314 రేషన్ షాపులుండగా, 1.41 లక్షల ఆహార భద్రత కార్డులున్నాయి. వీరికి ప్రతీ నెల మూడువేల మెట్రిక్ టన్నుల బియ్యం పంపిణీ చేస్తున్నారు. అంత్యోదయ లబ్ధిదారులకు 35 కిలోలు, అన్నపూర్ణ లబ్ధిదారులకు 10 కిలోల చొప్పున ప్రభుత్వం సరఫరా చేస్తోంది.

పగలు కొని రాత్రుల్లో విక్రయం

కొందరు రేషన్ డీలర్లు 'డబ్బులు కావాలా.. బియ్యం కావాలా' అని నేరుగా లబ్ధిదారులను అడుగుతుండడం గమనార్హం. కొందరు అక్రమార్కులు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి కిలో రూ.25 ఇస్తామని చెబుతున్నారు. చిరు వ్యాపారులు, దళారులు గ్రామాల్లో తిరుగుతూ, రేషన్ షాపుల వద్ద పగలు లబ్ధిదారులు, రేషన్ డీలర్ల నుంచి రూ.23 చొప్పున కొనుగోలు చేసి రాత్రుల్లో ప్రత్యేక వాహనాల్లో తరలించి మిల్లర్లు, బియ్యం వ్యాపారులకు రూ.28కి అమ్ముతున్నారు. అవి మళ్లీ మెరుగులు దిద్దుకుని ఎక్కువ ధరకు వినియోగదారుల వంట గదికి చేరుతున్నాయి. కొందరు మిల్లర్లు ప్రతీనెల అధికారులకు మామూళ్లు ఇస్తూ అక్రమ దందా నిర్వహిస్తున్నారనే ఆరోపణలున్నాయి. ప్రస్తుతం ప్రభుత్వం పంపిణీ చేస్తున్న సన్న బియ్యాన్ని లబ్ధిదారులు విక్రయిస్తే అధికారులు వారి ఆహార భద్రత కార్డులు తొలగించనున్నారు.

కేసులు నమోదు చేస్తాం

రేషన్ బియ్యం అక్రమంగా తరలించే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తాం. అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా పెట్టాం. ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న సన్న బియ్యాన్ని దుర్వినియోగం చేయొద్దు. సన్నబియ్యం విక్రయించే వారి సమాచారం తెలుపాలి.

– శ్రీనివాస్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ

ఇటీవల బియ్యం పట్టుకున్న ఘటనలు

- జిల్లా కేంద్రంలోని బజార్‌వాడిలో వ్యాపారి మధుసూదన్ ఇంట్లో ఈ నెల 3న ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు 2.79 క్వింటాళ్ల సన్నబియ్యం పట్టుకుని ఇద్దరిపై 6ఏ కేసు నమోదు చేశారు.
- కౌటాల మాజీ సర్పంచ్ వొజ్జల మౌనిశ్ ఇంట్లో నిల్వ ఉన్న 13.40 క్వింటాళ్ల సన్న బియ్యాన్ని అధికారులు పట్టుకుని, అమ్మిన ఆరుగురు, కొన్న మౌనిశ్‌పై కేసు నమోదు చేశారు.
- వాంకిడి మండలం బోర్దా గ్రామంలో ఓ ఇంట్లో నిల్వ ఉంచిన మూడు క్వింటాళ్ల సన్న బియ్యాన్ని ఈ నెల 6న అధికారులు పట్టుకుని ముగ్గురిపై కేసు నమోదు చేశారు.
- ఈ నెల 8న సిర్పూర్(టి) మండలం డోర్పల్లికి చెందిన అనురాధ ఇంట్లో అక్రమంగా నిల్వ చేసిన ఆరున్నర క్వింటాళ్ల బియ్యాన్ని పోలీసులు పట్టుకుని ఆమెపై కేసు నమోదు చేశారు.
- సిర్పూర్(టి) మండలం పారిగాం సమీపంలో ఈనెల 8న దిచక్రవాహనాలపై తరలిస్తున్న నాలుగు క్వింటాళ్ల సన్నబియ్యాన్ని అధికారులు పట్టుకుని ముగ్గురిపై కేసు నమోదు చేశారు.

బాల్య వివాహాలను ప్రోత్సహించొద్దు

ఆసిఫాబాద్‌రూరల్: బాల్య వివాహం చట్టరీత్యా నేరమని జిల్లా బాలల సంరక్షణాధికారి బూర్ల మహేశ్ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని రహపల్లి గ్రామంలో బాల్యవివాహం నిశ్చయించినట్లు వచ్చిన సమాచారం మేరకు సిబ్బందితో వెళ్లి కుటుంబ సభ్యులు, గ్రామస్తులకు కౌన్సిలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 18 ఏళ్ల తరువాతే వివాహం చేయాలని, ముందే వివాహం చేస్తే నేరమవుతుందని పేర్కొన్నారు. బాల్య వివాహాలతో కలిగే నష్టాలను వివరించారు ఎక్కడైనా బాల్య వివాహం చేస్తున్నట్లు తెలిస్తే చైల్డ్ హెల్ప్‌లైన్ 1098 లేదా 112 టోల్ ఫ్రీ నంబర్‌కు సమాచారం ఇవ్వాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన 2030 నాటికి బాల్య వివాహ రహిత భారత్ లక్ష్యంగా పని చేస్తున్నామని తెలిపారు. సోషల్ వర్కర్ ప్రవీణ్‌కుమార్, చైల్డ్ హెల్ప్‌లైన్ కోఆర్డినేటర్ కుమార్, కౌన్సిలర్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



కుటుంబ సభ్యులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

క్షయ నిర్మూలనకు కృషి చేయాలి

దహెగాం: క్షయ నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని డీఎంహెచ్‌వో సీతారాంనాయక్ సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో వైద్య సిబ్బంది, ఆశకార్యకర్తలకు ఎన్‌టీఈసీ కార్యక్రమంలో భాగంగా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్షయ కారణంగా దేశవ్యాప్తంగా ఏడాదిలో సగటున 3లక్షల మంది మరణిస్తున్నారని తెలిపారు. వ్యాధికి వైద్యం అందుబాటులో ఉందని, వ్యాధిగ్రస్తులు ఆందోళన చెందవద్దని పేర్కొన్నారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలోనూ వైద్యం అందుబాటులో ఉందని చెప్పారు. వ్యాధి లక్షణాలు గుర్తించడానికి త్వరలో సర్వే చేపట్టనున్నట్లు తెలిపారు. లక్షణాలున్న వారిని గుర్తించి ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి తరలించి వైద్యం పొందేలా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. క్షయ సోకి ప్రభుత్వ వైద్యం పొందుతున్నవారికి నెలకు రూ.వెయ్యి చొప్పున ఆరునెలలు ఆర్థికసాయం అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైద్యాధికారిని అశ్విని, హెచ్‌ఈవో కోటేశ్వర్, పీహెచ్ఎం పావని, హెచ్‌వీ పద్మ, సూపర్‌వైజర్ ఖాదర్‌పాషా, ఫార్మసిస్ట్ రామచంద్రారెడ్డి, సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీతారాం నాయక్

పరిసరాల పరిశుభ్రత పాటించాలి

కాగజ్‌నగర్ టౌన్: పరిసరాల పరిశుభ్రత పాటించాలని జిల్లా వైద్యాధికారి సీతారాం సూచించారు. శుక్రవారం కాగజ్‌నగర్ పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో డెంగీ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. వేసవిలో దోమల బెడద ఎక్కువగా ఉంటుందని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే వాటిని నివారించవచ్చని తెలిపారు. దోమ కాటుతో డెంగీ, మలేరియా వ్యాపిస్తాయని పేర్కొన్నారు. అంతకుముందు ఆస్పత్రి నుంచి పట్టణంలోని పలు వీధుల గుండా డెంగీపై అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఆస్పత్రి సిబ్బంది, ఆశ కార్యకర్తలున్నారు.

'ఆదర్శ'ం పిలుస్తోంది!

- మోడల్ స్కూళ్లలో 320 ఇంటర్ సీట్లు
- ఈ నెల 20వరకు దరఖాస్తు గడువు
- కార్పొరేట్ తరహాలో విద్యాబోధన
- బాలికలకు హాస్టల్ సదుపాయం



ఆసిఫాబాద్‌లోని తెలంగాణ మోడల్ స్కూల్

ఆసిఫాబాద్‌రూరల్: ఇంగ్లిష్ మీడియంలో ఇంటర్మీడియట్ చదవాలనుకునే గ్రామీణ విద్యార్థులకు తెలంగాణ మోడల్ స్కూల్ ఓ వరంలా మారింది. మోడల్ స్కూల్‌లో చదువుతున్న విద్యార్థులు చదువుతో పాటు క్రీడలు, కళలు, సాంస్కృతిక రంగాల్లో రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరుస్తున్నారు. పరీక్షా ఫలితాల్లో జిల్లాలోనే టాప్ ర్యాంకులు సాధిస్తున్నారు. ఇంటర్ ఫలితాల్లో విద్యార్థులు తిరుగులేని అధిపత్యాన్ని ప్రదర్శిస్తున్నారు. నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్ షిప్, జేఈఈ మెయిన్స్ సీట్లు కూడా కైవసం చేసుకుంటున్నారు. దీంతో జిల్లాలో పదో తరగతి ఉత్తీర్ణులైనవారు చాలామంది మోడల్ స్కూల్‌లో చదివేందుకే మొగ్గు చూపుతున్నారు. మోడల్ స్కూళ్లలో ఈ నెల 1నుంచి 20వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్నారు.

ఒక్కో గ్రూపులో 40 సీట్లు

జిల్లాలో ఆసిఫాబాద్, సిర్పూర్ (యూ)లో తెలంగాణ మోడల్ స్కూళ్లున్నాయి. ఒక్కో కళాశాలలో 160 సీట్లున్నాయి. సీఈసీ, ఎంఈసీ, ఎంపీసీ, బైపీసీ గ్రూపులలో గ్రూపునకు 40 చొప్పున రెండు స్కూళ్లలో మొత్తం 320 సీట్లు అందుబాటులో ఉన్నాయి. పదో తరగతిలో మెరిట్ ఆధారంగా రోస్టర్ ప్రకారం విద్యార్థుల ఎంపిక ఉంటుంది. 100 మంది బాలికలకు హాస్టల్ వసతి కల్పించనున్నారు. చుట్టు పక్కల గ్రామాల్లో కాకుండా దూరప్రాంతాల నుంచి వచ్చే 9, 10, ఇంటర్ చదవే బాలికలకు భోజన వసతి కల్పిస్తారు. పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షా ఫలితాల్లో ఆసిఫాబాద్ మోడల్ స్కూల్ జిల్లాలోనే టాప్‌గా నిలుస్తోంది. 2023–24లో ఇంటర్ ఫలితాల్లో 92 శాతం, ఈ సంవత్సరం కూడా 94 శాతంతో 20మంది విద్యార్థులు 900కు పైగా మార్కులు సాధించారు. అదిబా తహిరీం 971, హర్షిత 970 మార్కులతో జిల్లాలోనే టాప్‌గా నిలిచారు.

రిజర్వేషన్ల వారీగా సీట్ల వివరాలు				
కేటగిరీ	శాతం	సీట్లు	జనరల్	బాలికలు
జనరల్	50	20	13	07
ఎస్సీ	15	06	04	02
ఎస్టీ	06	02	01	01
బీసీ 'ఏ'	07	03	02	01
బీసీ 'బీ'	10	04	03	01
బీసీ 'సీ'	01	00	00	00
బీసీ 'డీ'	07	03	02	01
బీసీ 'ఈ'	04	02	02	00

అందుబాటులో 320 సీట్లు

పదో తరగతి పాసైన విద్యార్థులు ఎలాంటి రుసుము లేకుండా ఈ నెల 20వరకు దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తు ప్రక్రియ పూర్తయ్యాక ఈ నెల 27నుంచి 31వ తేదీ వరకు ధ్రువీకరణ పత్రాలు పరిశీలించి ఎంపిక జాబితా విడుదల చేస్తారు. ఎంపికైన విద్యార్థులకు ఉచితవిద్య, వసతి, పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్, యూనిఫాంలు, కంప్యూటర్ విద్య, ఐఎఫ్‌పీ డిజిటల్ బోర్డులతో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో బోధిస్తారు.

కార్పొరేట్ తరహాలోనే..



మా పాఠశాలలో కార్పొరేట్ తరహాలో తరగతులు నిర్వహిస్తున్నాం. విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించేలా సంసిద్ధులను చేస్తున్నాం. పదోతరగతి పాసైన విద్యార్థులు ఈ నెల 20వ తేదీ లోపు ఇంటర్ చదివేందుకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.

– మహేశ్వర్, అధ్యాపకుడు, ఆసిఫాబాద్

ఉత్తమ ఫలితాలు సాధించాం



మోడల్ కళాశాలలో అధ్యాపకులు విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. నేను ఇంటర్‌లో 971 మార్కులు సాధించాను. మా కళాశాల అధ్యాపకులు, ఉపాధ్యాయుల సలహాలు, సూచనలు పాటించి ఉత్తమ ఫలితాలు సాధించాం.

– అదిబా తహిరీం, మోడల్ స్కూల్

సీటు రావడం అదృష్టమే



మోడల్ కళాశాలలో సీటు రావడం అదృష్టమే. ఈ కళాశాలలో క్రమ శిక్షణతో కూడిన కార్పొరేట్ విద్యను అధ్యాపకులు బోధిస్తున్నారు. అధ్యాపకుల బోధన బాగుండడంతో పదో తరగతి, ఇంటర్‌లో జిల్లా స్థాయిలో టాప్ మార్కులు వస్తున్నాయి.

– చందన, ఫస్టియర్ సీఈసీ

క్లుప్తంగా

బైండోవర్ ఉల్లంఘించిన యువకుడికి జరిమానా

మందమర్రిరూరల్: పాత కేసుల్లో బైండోవర్ నిబంధనలు ఉల్లంఘించిన యువకుడికి తహసీల్దార్ సతీశ్‌కుమార్ శుక్రవారం రూ.2 లక్షల జరిమానా విధించినట్లు ఎస్సై రాజశేఖర్ తెలిపారు. స్థానిక రామన్‌కాలనీకి చెందిన మునియప్ప గతంలో నేరాలకు పాల్పడగా తహసీల్దార్ ఎదట బైండోవర్ చేయగా నోటీసులు జారీచేశారు. నిబంధనలు ఉల్లంఘించి తిరిగి నేరాలు చేస్తుండడంతో రూ.2 లక్షల జరిమానా చెల్లించాలని లేకపోతే 6నెలల జైలు శిక్ష ఉంటుందని తహసీల్దార్ వివరించారు.

వ్యక్తిని కాపాడిన పోలీసులు



కాపాడిన వ్యక్తితో పోలీస్ సిబ్బంది

లక్ష్మణచాంద: తాను ఆత్మహత్య చేసుకుంటానని డయల్ 100కు ఫోన్ చేసిన ఓ వ్యక్తిని పోలీసులు కాపాడారు. వివరాలు ఇలా ఉన్నాయి.. మండలంలోని బోరిగాం గ్రామానికి చెందిన శివరాత్రి వెంకట్ తన భార్యతో గొడవపడ్డాడు. ఈ క్రమంలో మామడ మండలం లింగంపెల్లి బ్రిడ్జి సమీపంలోకి వెళ్లి తాను ఆత్మహత్య చేసుకుంటానని శుక్రవారం మధ్యాహ్నం డయల్ 100కు ఫోన్‌చేసి చెప్పాడు. లక్ష్మణచాంద బ్లూకోల్ట్స్ సిబ్బంది పీసీ అశోక్, హోంగార్డులు భూమన్న, మోహన్ అక్కడికి చేరుకుని వెంకట్‌ను అదుపులో తీసుకున్నారు. అతని వద్ద ఉన్న వైర్‌ను స్వాధీనం చేసుకుని వెంకట్‌ను పోలీసుస్టేషన్‌కు తరలించారు. కుటుంబీకుల సమక్షంలో కౌన్సెలింగ్ ఇచ్చి వారికి అప్పగించినట్లు ఎస్సై సుప్రియ తెలిపారు. వ్యక్తిని కాపాడిన సిబ్బందిని ఎస్సై అభినందించారు.

తాత్కాలిక బస్‌షెల్టర్ ధ్వంసం

భీమారం: మండల కేంద్రంలో ప్రయాణికుల కోసం ఏర్పాటుచేసిన తాత్కాలిక బస్‌షెల్టర్‌ను గురువారం రాత్రి గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో ధ్వంసమైంది. వేసవి దృష్ట్యా బస్‌షెల్టర్‌లో కూర్చునేందుకు దాతలు ఏర్పాటు చేసిన సిమెంట్ బెంచీలు కొన్ని విరిగిపోయాయి. శుక్రవారం ప్రయాణికులు కొంత ఇబ్బందిపడ్డారు. పంచాయతీ సిబ్బంది మధ్యాహ్నం బస్‌షెల్టర్‌కి మరమ్మతు చేపట్టారు.

కల్వర్టుపైకి దూసుకెళ్లిన కారు




కుంటాల: స్థానిక మున్నూరు కాపు సంఘం వద్ద అడిషనల్ కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ ప్రయాణిస్తున్న కారు అదుపుతప్పి కల్వర్టుపైకి దూసుకెళ్లింది. కుంటాలలో శుక్రవారం భూభారతి రెవెన్యూ సదస్సుకు మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి విచ్చేస్తున్నారు. మంత్రికి స్వాగతం పలికేందుకు భైంసా హెలిప్యాడ్ వద్దకు వెళ్తుండగా ఈ ఘటన చోటు చేసుకుంది. వెంటనే అప్రమత్తమైన పోలీసులు కల్వర్టుపైనుంచి కారు తప్పించారు.

చిన్నయ్యగుట్టను చూసొద్దాం



చిన్నయ్య గుట్టకు వెళ్లే పరుపుబండ దారి



- పర్యాటక కేంద్రంగా ప్రకటించాలి
- గిరిజనుల ఆరాధ్యుడు చిన్నయ్యదేవుడు
- దర్శనం కోసం తరలివస్తున్న భక్తులు

లక్సెట్టిపేట: మండలంలోని హన్మంతుపల్లి గ్రామ పంచాయతీ పరిధి చల్లంపేట గ్రామశివారు అటవీప్రాంతంలో సుమారు 150 ఏళ్లక్రితం నుంచి చిన్నయ్యగుట్టపై చిన్నయ్య దేవుడు కొలువై ఉన్నాడు. గిరిజనుల ఆరాధ్య దైవంగా వెలుగొందుతూ ఈ ప్రాంతంలో ఎంతో ప్రసిద్ధిగాంచాడు. చారిత్రాత్మకంగా వెలిసిన చిన్నయ్య దేవుడిని గిరిజనులు, భక్తులు తరలివచ్చి పూజిస్తుంటారు. ప్రాచీనకాలంలో పాండవులు ఇక్కడ వ్యవసాయం చేసేవారు. ద్రౌపది స్నానం చేయడానికి కొల్లు గుంటలు, పరుపు బండపై వ్యవసాయం చేసినట్లు నాగళి సాళ్లు, గుడి లోపల దొనలో పట్టే మంచం దేవుని విగ్రహాలు ఉన్నట్లు ఇప్పటికి పూర్వీకులు చెబుతుంటారు. వర్షాకాలం ప్రారంభ సమయంలో సుదూర ప్రాంతాల నుంచి ఇక్కడకు దర్శనం కోసం వస్తుంటారు. రైతులు వరదపాశం బోనాలు వండి చిన్నయ్య దేవునికి నైవేద్యంగా సమర్పిస్తారు. పంట పొలాలకు పురుగులు సోకితే ఇక్కడి తీర్థపు నీరు పొలాలపై చల్లితే పోతాయనే వారి నమ్మకం.

అల్లుబండ..

గుడిలో అల్లుబండకు ప్రత్యేక స్థానం. అక్కడికి వచ్చిన భక్తులు తమ మనసులో కోర్కెలు కోరుకుని అల్లుబండ లేపితే సులభంగా లేచినట్లైతే కోరిక నెరవేరుతుంది. అల్లుబండ బరువుగా ఉంటే కోరిక నెరవేరదని నమ్మకం. అల్లుబండ ప్రదేశం వద్ద భక్తులు వారి కోర్కెలు కోరుకుంటారు.

చిన్నయ్య దేవుడి ప్రత్యేకత

పంట పొలాలు దుక్కి దున్నే ముందు దేవుడి దర్శనం చేసుకుంటారు. బండారు (పసుపు) తెచ్చుకుని ధాన్యం వేసేటప్పుడు అందులో కలిపి వ్యవసాయం సాగు చేస్తారు. పంట చేతికి వచ్చిన తర్వాత దినుసును దేవుడికి అప్పజెప్పి మొక్కిన మొక్కు చెల్లించుకుంటారు. వేసవికాలం ముగింపు సమయంలో చిన్నయ్య గుడి భక్తులతో కిటకిటలాడుతుంది.

ఇలా వెళ్లాలి..

పట్టణం నుంచి చందారం, హన్మంతుపల్లి, దొడపల్లి, రంగపేట, జెండావెంకటాపూర్ గ్రామాల మీదుగా 10 కి.మీ దూరం వాహనాలపై చల్లంపేట వరకు చేరుకోవాలి. అక్కడి నుంచి అటవీ ప్రాంతంగుండా సుమారు 3 కి.మీ కాలినడకన వెళ్తే చిన్నయ్యగుట్ట దేవుడి గుడికి చేరుకోవచ్చు. ఇక్కడికి వచ్చేందుకు అన్ని గ్రామాలకు రోడ్డు సౌకర్యం ఉంది. సమీప ప్రాంతంలో నీళ్ల సదుపాయం చిన్నపాటి బుగ్గ వాగు లాంటిది ఉంటుంది. అందులోని నీటిని తాగడానికి వాడుతారు. ఇప్పటికి అక్కడ గిరిజనులే పూజార్లుగా కొనసాగుతుంటారు. ప్రతీ ఆది, గురువారాల్లో పూజలు నిర్వహిస్తారు. మేకలు, కోళ్లతో దేవుడికి మొక్కలు చెల్లించి ఆ తర్వాత వంట చేసుకుని సహపంక్తి భోజనాలు చేస్తారు. కాగా, బుగ్గవాగు ప్రాంతంపై బ్రిడ్జి నిర్మాణానికి ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్ రావు ఇటీవల రూ.కోటి నిధులు మంజూరు చేసి శిలాఫలకం వేశారు. ఇంకా పనులు ప్రారంభించలేదు.

పర్యాటక కేంద్రంగా ఏర్పాటు చేయాలి



అటవీప్రాంతంలో ఉన్న చిన్నయ్యగుట్టను పర్యాటక కేంద్రంగా ఏర్పాటు చేయాలి. రహదారి మధ్యలో మత్తడి నీటిని నిల్వచేయడంతోపాటు వాటికి అనుకూలంగా రోడ్డు ఏర్పాటు చేస్తే పుణ్యక్షేత్రంగా, పర్యాటక కేంద్రంగా ఏర్పడుతుంది. ఆలయానికి ప్రత్యేక హోదా లభిస్తుంది. గిరిజనుల ప్రత్యేక అలయం ప్రత్యేకంగా ఉంటుంది. భక్తుల సంఖ్య పెరుగుతుంది.

– అన్నం చిన్నన్న, గ్రామస్తుడు, చందారం

హాయ్.. అయాం పూజ అంటూ టోకరా

- మహిళల పేరిట చాటింగ్
- కోరిక తీరుస్తామంటూ ఎర
- తీరా వచ్చాక నిలువు దోపిడీ
- ఇద్దరిని అరెస్టు చేసిన పోలీసులు



నిందితుల అరెస్టు చూపుతున్న కరీంనగర్ రూరల్ సీఐ నిరంజన్‌రెడ్డి

కొత్తపల్లి(కరీంనగర్): ముగ్గురు యువకులు ముఠాగా ఏర్పడ్డారు. మహిళల పేరిట యువకులతో చాటింగ్ చేస్తూ కోరికలు తీరుస్తామంటూ ఎరవేస్తున్నారు. ఈ ఓ వ్యక్తిని మభ్యపెట్టి దోపిడీకి పాల్పడిన సంఘటన కరీంనగర్ జిల్లా కొత్తపల్లి మండలంలో వెలుగు చూసింది. ఇద్దరు యువకులను పోలీసులు శుక్రవారం అరెస్టు చేయగా, మరొకరు పరారీలో ఉన్నాడు. కొత్తపల్లి పోలీసుల కథనం ప్రకారం.. కొత్తపల్లి మండలం చింతకుంట శాంతినగర్‌కు చెందిన సరళ సందీప్(19), మల్కాపూర్ లక్ష్మీపూర్‌కు చెందిన పొన్నాల ప్రణయ్‌కుమార్(18), ఎండీ రెహాన్ జల్సాలకు అలవాటు పడి, దోపిడీలకు కొత్త రకం పన్నాగం పన్నారు. మహిళల పేరిట కోరిక తీరుస్తామంటూ వాట్సాప్‌లో యువకులకు మెసేజ్ చేస్తారు. ఆకర్షితులైన యువకులను చాటింగ్‌తో మభ్యపెడతారు. సరళ సందీప్ ఈ నెల 6న తన ఫోన్ ద్వారా మంచిర్యాల ప్రాంతానికి చెందిన ఓ యువకుడికి వాట్సాప్‌లో హాయ్ అయాం పూజ అంటూ మెసేజ్ చేశాడు. స్పందించి యువకుడు చాటింగ్ చేశాడు. కోరిక తీరుస్తానంటూ ఆశ చూపడంతో అది నమ్మి ఈ నెల 11న కరీంనగర్ వచ్చాడు. పథకం ప్రకారం దోపిడీకి సిద్ధమైన ముగ్గురు యువకులు కొత్తపల్లికి రప్పించారు. ఇద్దరు యువకులు ద్విచక్ర వాహనంపై యువకుడిని వెలిచాల శివారు ప్రాంతానికి తీసుకెళ్లారు. అప్పటికే అక్కడికి చేరుకున్న రెహాన్‌తో కలిసి యువకుడిని చిత్రహింసలకు గురిచేశారు. రూ.50వేలు డిమాండ్ చేశారు. ఇవ్వకుంటే చంపుతామని బెదిరించడంతో తన వద్ద ఉన్న రూ.10వేలు ఇచ్చాడు. బంధువులు, స్నేహితులకు ఫోన్ చేసి మరో రూ.12వేలు ఫోన్ పే ద్వారా ట్రాన్స్‌ఫర్ చేశాడు. ముగ్గురు నిందితులు సదరు యువకుడిని అక్కడే వదిలేసి వెళ్లిపోయారు. బాధితుడు కొత్తపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఎస్సై ఎస్ సాంబమూర్తి ఆధ్వర్యంలోని బృందం శుక్రవారం రేకుర్తి బస్టాండ్ ప్రాంతంలో సరళ సందీప్, పొన్నాల ప్రణయ్ కుమార్‌ను అరెస్టు చేశారు. రెహాన్ పరారీలో ఉన్నాడు.

ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే పీడీయాక్ట్

- మున్సిపల్ భూమిని రిజిస్ట్రేషన్ చేసుకున్న వ్యక్తి రిమాండ్
- ఆదిలాబాద్ డీఎస్పీ జీవన్‌రెడ్డి



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ జీవన్‌రెడ్డి

ఆదిలాబాద్‌టౌన్: ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే పీడీయాక్ట్ కేసులు నమోదు చేస్తామని ఆదిలాబాద్ డీఎస్పీ జీవన్‌రెడ్డి హెచ్చరించారు. శుక్రవారం వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఈ మేరకు వివరాలు వెల్లడించారు. పట్టణంలో కోట్ల రూపాయల మున్సిపల్ భూమిని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకున్న వ్యక్తిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. పట్టణంలోని భుక్తాపూర్‌కు చెందిన ఏ–2 అక్రమ్ మున్సిపల్ ఖాళీ స్థలాన్ని ఆక్రమించాలనే ఉద్దేశంతో తన బంధువు షాబొద్దీన్ పేరిట దస్తావేజులు సృష్టించినట్లు తెలిపారు. 35 ఏళ్లుగా అక్కడే ఉంటున్నట్లు ఇంటినంబర్ తీసుకున్నాడు. అక్రమ పద్ధతిలో రిజిస్ట్రేషన్ నమోదు చేసుకున్నట్లు పేర్కొన్నారు. మున్సిపల్ కమిషనర్ ఫిర్యాదుతో పలు కేసులు నమోదు చేసినట్లు వివరించారు. భుక్తాపూర్‌లో 469.44 స్క్వేర్ యార్డ్స్ ఆక్రమించి ఇంటి నం.6–6–36/2/1 తీసుకున్నాడు. మున్సిపల్ సిబ్బంది పాత్రపై దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. అక్రమ పద్ధతిలో రిజిస్ట్రేషన్ చేసుకున్న వారిపై నాన్‌బెయిలబుల్ కేసులతోపాటు పీడీయాక్ట్ నమోదు చేస్తామన్నారు. ల్యాండ్ మాఫియా, రౌడీలు గతంలో బెదిరింపులకు పాల్పడి రిజిస్ట్రేషన్ చేసుకుని ఉంటే పోలీసులను ఆశ్రయించాలన్నారు. సమావేశంలో వన్‌టౌన్ సీఐ సునీల్ కుమార్, పోలీసుసిబ్బంది పాల్గొన్నారు.

ఫైవ్ స్టార్ రేటింగ్‌తో ఆర్కేన్యూటెక్ ఆదర్శం

- జీఎం శ్రీనివాస్



మాట్లాడుతున్న జీఎం శ్రీనివాస్

శ్రీనివాస్: శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్కే న్యూ టెక్ గని 5 స్టార్ రేటింగ్ సాధించి ఇతర గనుల కు ఆదర్శంగా నిలిచిందని జీఎం ఎం.శ్రీనివాస్ తెలిపారు. గని స్టార్ రేటింగ్ సాధించిన సందర్భంగా గనిపై శుక్రవారం ఏర్పాటు చేసిన అభినందనల కార్యక్రమంలో ఆయన పాల్గొని మా ట్లాడారు. దేశంలోని 144 భూగర్భ గనుల్లో ఫైవ్ స్టార్ రేటింగ్ సాధించిన గనుల్లో ఆర్కే న్యూటెక్ గని మూడో స్థానంలో నిలవడం అభినందనీ యమన్నారు. మంచి బొగ్గు ఉత్పాదకత సాధి స్తూ ఇతర గనులకు ఆదర్శంగా నిలిచిందన్నా రు. ఉద్యోగులు, అధికారులు, సూపర్‌వైజర్లు స మష్టిగా పనిచేయడం వల్ల ఇది సాధ్యమైందని తెలిపారు. మున్ముందు కూడా ఇదే స్ఫూర్తితో పని చేయాలన్నారు. యువ కార్మికులు గైర్హాజ రు లేకుండా పనిచేయాలన్నారు. గనిలోని 1వ సీమ్‌లో మిగిలిన బొగ్గు నిల్వలు తీసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని, దీని ద్వారా జీవిత కాలం మరో మూడేళ్లు పెరిగే అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో గుర్తింపు సంఘం బ్రాంచి కార్యదర్శి బాజీ సైదా, ఏజెంట్ కె.రాజేందర్, గని మేనేజర్ స్వామి రాజు, గ్రూప్ ఇంజనీర్ రవిచరణ్, రక్షణ అధికారి కొట్టె రమేశ్, సంక్షేమాధికారి పాల్ సృజన్, పిట్ కార్యదర్శి ఆకుల లక్ష్మణ్, ఇంజనీర్ కృష్ణ, అధికారులు శంకరయ్య, సాత్విక్ పాల్గొన్నారు.

రెస్ట్‌హాల్ ప్రారంభం..

ఆర్కే 7 గనిలో మహిళా ఉద్యోగుల కోసం ఏర్పాటు చేసిన రెస్ట్‌హాల్‌ను జీఎం ప్రారంభించారు. మహిళా ఉద్యోగుల కోసం ప్రత్యేక సౌకర్యాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గని మేనేజర్ తిరుపతి, రక్షణ అధికారి సంతోష్, సంక్షేమాధికారి శంతన్, ఫిట్ కార్యదర్శి సారయ్య పాల్గొన్నారు.

నకిలీ పత్తి విత్తనాలు పట్టివేత



పట్టుకున్న నకిలీ విత్తనాలతో ఏవో సృజన, పోలీసులు

నెన్నెల: మండలంలోని నందులపల్లి గ్రామానికి చెందిన తోట వెంకటేశం వద్ద శుక్రవారం రూ.1.20 లక్షల విలువ కలిగిన 40 కిలోల నకిలీ పత్తి విత్తనాలు పట్టుకున్నామని ఎస్సై ప్రసాద్ తెలిపారు. నందులపల్లిలో నకిలీ విత్తనాల క్రయవిక్రయాలు జరుగుతున్నట్లు ఏవో పుప్పాల సృజన ఫిర్యాదు చేయగా సోదాలు చేశామన్నారు. నందులపల్లి ప్రాజెక్టు ప్రాంతంలో 40 కిలోల విత్తనాలను తన చేనులో దాచేందుకు ప్రయత్నిస్తూ వెంకటేశం పట్టుబడ్డాడని చెప్పారు. మందమర్రికి చెందిన పిండి సురేశ్ వద్ద లూజ్ విత్తనాలు కొనుగోలు చేసినట్లు ఒప్పుకున్నాడని తెలిపారు. రెండు విత్తన సంచులను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామని ఎస్సై వివరించారు.

20 ట్రాక్టర్లు సీజ్

మంచిర్యాలరూరల్(హాజీపూర్): మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ముల్కల్ల ఇసుక రీచ్ వెళ్లే రహదారిలో శుక్రవారం హాజీపూర్ పోలీసుల ఆకస్మిక తనిఖీల్లో 20 ట్రాక్టర్లు సీజ్ చేశారు. ఇటీవల ముల్కల్ల ఇసుక రీచ్‌కు వెళ్లే జాతీయ రహదారిపై ఇసుక ట్రాక్టర్ ఢీ ఒకరు మృతి చెందడంతో ఎస్సై స్వరూప్‌రాజ్ ఆధ్వర్యంలో తనిఖీ చేపట్టారు. ధ్రువీకరణ పత్రాలు లేని వాహనాలతోపాటు డ్రైవింగ్ లైసెన్స్, ఫిట్‌నెస్ లేని మొత్తం 20 ట్రాక్టర్లను స్టేషన్‌కు తరలించారు. సాయంత్రం పోలీస్ స్టేషన్ ఆవరణలో ట్రాక్టర్ యజమానులు, డ్రైవర్లతో ఏర్పాటు చేసిన సమావేశమయ్యారు. వాహనానికి ఇన్స్రూ?న్స్ విధిగా ఉండాలని, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపితే చర్యలు ఉంటాయన్నారు. కాగా సీజ్ చేసిన వాహనాలకు సంబంధించి సరైన ధ్రువీకరణ పత్రాలు, డ్రైవింగ్ లైసెన్స్, ఫిట్‌నెస్ ఉన్న వాహనాల పత్రాలు పరిశీలించి జరిమానాలు విధించి పంపించారు. మిగిలిన ట్రాక్టర్లను జిల్లా రవాణా శాఖకు బదలాయించారు.

తప్పిపోయిన బాలుడి అప్పగింత



తల్లికి అప్పగిస్తున్న డీసీపీవో మహేశ్, సిబ్బంది

ఆసిఫాబాద్‌రూరల్: తప్పిపోయిన బాలుడిని క్షేమంగా తల్లికి శుక్రవారం అప్పగించినట్లు డీసీపీవో మహేశ్ తెలిపారు. సికింద్రాబాద్ నుంచి తప్పిపోయి దక్షిణ ఎక్స్‌ప్రెస్ రైలులో కాగజ్‌నగర్ రైల్వే పోలీసులకు పట్టుకుని, ఈనెల 9న జిల్లా కేంద్రంలో బాల రక్షభవన్‌కు అప్పగించారు. రక్షభవన్ సిబ్బంది బాలుడికి కౌన్సెలింగ్ నిర్వహించి మాట్లాడి వారి సొంత గ్రామమైన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని పల్నాడు జిల్లాగా గుర్తించారు. తల్లిదండ్రులకు సమాచారం అందించగా, తల్లి ఇక్కడకు రాగా, బాలుడిని అప్పగించినట్లు డీసీపీవో మహేశ్ తెలిపారు. సిబ్బంది శ్రావణ్, ప్రవీణ్ కుమార్, ఝాన్సీరాణి తదితరులు పాల్గొన్నారు.

కడుపునొప్పి భరించలేక యువకుడి ఆత్మహత్య



గోపాల్ (ఫైల్)

తిర్యాణి: కడుపునొప్పి భరించలేక యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై శ్రీకాంత్ కథనం ప్రకారం.. మండలంలోని దేవాయిగూడ పంచాయతీ పరిధిలోని చందగూడ గ్రామానికి చెందిన కుర్సెంగ గోపాల్ (27) గత మూడేళ్లుగా తీవ్రమైన కడుపునొప్పితో బాధపడేవాడు. స్థానికంగా మందులు వాడినా నొప్పి తగ్గలేదు. ఈ క్రమంలో మనస్తాపం చెంది గురువారం మధ్యాహం గ్రామశివారులోని పంట చేనులో గుర్తు తెలియని పురుగుల మందు తాగాడు. ఈ విషయాన్ని సోదరి అయిన కమలకు ఫోన్ చేసి చెప్పాడు. కుటుంబీకులు ఘటన స్థలానికి చేరుకుని గోపాల్‌ను గోలేటిలోని సింగరేణి ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స అందించారు. మెరుగైన వైద్యం కోసం మంచిర్యాలలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ రాత్రి మృతిచెందినట్లు ఎస్సై పేర్కొన్నారు. మృతుడి తండ్రి రాము ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పెళ్లి ఇష్టం లేక యువతి..

ఖానాపూర్: పెళ్లిచేసుకోవడం ఇష్టం లేక యువతి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఎస్సై రాహుల్ గైక్వాడ్ కథనం ప్రకారం..మండలంలోని పాత ఎల్లాపూర్ పంచాయతీ పరిధిలోని ఒడ్డెవాడకు చెందిన అల్లెపు పోశాని, రాజేందర్ దంపతుల కూతురు అక్షయ (18) ఇంటర్ చదువుతోంది. గత కొన్ని రోజులుగా యువతికి పెళ్లి సంబంధాలు వస్తున్నాయి. తల్లిదండ్రులు పెళ్లి చేసుకోవాలని కోరగా యువతికి ఇష్టం లేదు. ఈక్రమంలో మనస్తాపంతో గురువారం రాత్రి ఇంట్లో ఉరేసుకుంది. ఈమేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

తిర్యాణి: రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందినట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం..మండలంలోని మార్కగూడ పంచాయతీ పరిధి వాడిగూడ గ్రామానికి చెందిన మెస్రం యేసు (50)గురువారం గృహ అవసరాల వస్తువుల కొనుగోలు కోసం బైక్‌పై తిర్యాణికి వచ్చాడు. తిరిగి రాత్రి ఇంటికి వెళ్తుండగా కై రిగూడ సమీపంలో రెండు ఎద్దులు పొట్లాడుకుంటూ వచ్చి అటుగా బైక్‌ను ఢీకొట్టాయి. యేసు తలకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు అతన్ని చెలిమల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ప్రథమచికిత్స అందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. మృతుడి కుమారుడు సంతోశ్ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్సై తెలిపారు.

గోదావరి నదిలో పడి యువకుడు..

బాసర: బాసర గోదావరి నదిలో ప్రమాదవశాత్తు యువకుడి పడి మృతిచెందినట్లు ఎస్సై శ్రావణి తెలిపారు. ఆమె కథనం ప్రకారం..బిహార్ రాష్ట్రానికి చెందిన శర్మ దిల్‌కుష్(19) బాసరలో హమాలీ పనిచేస్తున్నాడు. తన కుటుంబ సభ్యులతో కలిసి కొన్నిరోజుల క్రితం ఇక్కడకు వచ్చాడు. శుక్రవారం బాసర గోదావరి రెండో ఘాట్ వద్ద స్నానాలు ఆచరించేందుకు కుటుంబ సభ్యులు రాగా, ప్రమాదవశాత్తు నీటిలో మునిగాడు. ఈత రాకపోవడంతో మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. కుటుంబ సభ్యులు సమాచారం అందించడంతో పోలీసులు ఘటన స్థలానికి చేరుకున్నారు. గజ ఈతగాళ్లతో గాలించి యువకుడి మృతదేహాన్ని ఒడ్డుకు చేర్చారు. మృతదేహాన్ని భైంసా ప్రభుత్వ ఏరియాస్పత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రైలు ఢీకొని ఒకరు..

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ రాళ్లపేట రైల్వేస్టేషన్ల మధ్య వంజీరి రైల్వేగేటు సమీపంలో శుక్రవారం రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందాడు. రైలు పట్టాలు దాటుతుండగా బల్లార్షా నుంచి మంచిర్యాల వైపు వెళ్లే రైలు ఢీకొని వ్యక్తి మృతి చెందినట్లు రైల్వే హెడ్‌కానిస్టేబుల్ సురేష్ తెలిపారు. మృతుడికి 50 నుంచి 55 వయస్సు ఉంటుందని, బ్రౌన్, వైట్ లైనింగ్‌కలర్ ఫుల్‌షర్టు, సిమెంట్ కలర్ నైట్ ప్యాంట్ ధరించి ఉన్నాడని పేర్కొన్నారు.

ట్రాక్టర్ కిందపడ్డ మహిళా కూలీ



స్వప్న మృతదేహం

ఖానాపూర్: మండలంలోని మస్కాపూర్ పంచాయతీ పరిధి గంగాయిపేట్ గ్రామ శివారులో ఇటుకబట్టి వద్ద ప్రమాదవశాత్తు ట్రాక్టర్ కిందపడి గాయపడ్డ గిరిజన కూలీ మృతిచెందింది. ఈ సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్సై రాహుల్ గైక్వాడ్ తెలిపిన వివరాల ప్రకారం.. గంగాయిపేట్ గ్రామానికి చెందిన మేస్రం స్వప్న(35) ఇటుక బట్టి వద్ద ట్రాక్టర్‌లో ఇటుకలు నింపేందుకు వెళ్లింది. ఇటుకలు నింపిన తర్వాత ట్రాక్టర్‌ను వెనక్కి తీస్తుండగా ఆమెకు తగిలి కింద పడింది. ఆమె పై నుంచి ట్రాక్టర్ టైరు వెళ్లడంతో తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు ఖానాపూర్ ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రథమ చికిత్స అనంతరం నిర్మల్‌కు తరలించగా, చికిత్స పొందుతూ చనిపోయింది. స్వప్నకు భర్త, ముగ్గురు కూతుళ్లు ఉన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

భక్తులకు ఇబ్బంది లేకుండా చర్యలు



అధికారులతో మాట్లాడుతున్న డీసీపీ భాస్కర్

కోటపల్లి: భూపాలపల్లి జిల్లా కాళేశ్వరంలో జరిగే సరస్వతీ పుష్కరాలకు 63వ జాతీయ రహదారిపై వెళ్లే భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకున్నట్లు డీసీపీ భాస్కర్ తెలిపారు. పార్‌పల్లి 63వ జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన అంతరాష్ట్ర చెక్‌పోస్టును పరిశీలించి జాతీయ రహదారిపై ప్రయాణిస్తున్న వాహనాల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. 24గంటలు షిఫ్టుల వారీగా పెట్రోలింగ్ నిర్వహణ, పోలీసుల తనిఖీలు, రహదారిపై లైటింగ్ ఏర్పాట్లపై అధికారులకు సూచనలు చేసినట్లు తెలిపారు. ఏసీపీ వెంకటేశ్వర్లు, సీఐలు సుధాకర్, దేవేందర్‌రావు, ఎస్సై రాజేందర్ ఉన్నారు.

బాసరకు పోటెత్తిన భక్తులు



క్యూలైన్‌లో భక్తులు

బాసర: బాసరలోని శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారి ఆలయానికి భక్తులు పోటెత్తారు. శుక్రవారం సంకష్ట హర చతుర్థి శుభ ముహూర్తం ఉండడంతో అధిక సంఖ్యలో తరలివచ్చారు. ముందుగా గోదావరి నదిలో పుణ్యస్నానాలు చేసి అమ్మవారి దర్శనానికి క్యూలైన్‌లో బారులు తీరారు. అనంతరం అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. అక్షరాభ్యాస మండపంలో చిన్నారులకు తల్లిదండ్రులు అర్చకులతో అక్షర శ్రీకార పూజలు చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్సై శ్రావణి బందోబస్తు ఏర్పాటు చేశారు.

నిజాయతీ చాటుకున్న యువకుడు



బ్యాగును అప్పగిస్తున్న మారుతి

బాసర: బాసర జ్ఞాన సరస్వతి అమ్మవారి దర్శనానికి వచ్చిన భక్తుడు పోగొట్టుకున్న బ్యాగును యువకుడు అప్పగించి నిజాయతీ చాటుకున్నాడు. నిజామాబాద్ జిల్లాకు చెందిన ప్రకాశ్ కుటుంబ సభ్యులతో కలిసి శుక్రవారం బాసరకు వచ్చారు. గోదావరి నదిలో స్నానాలు ఆచరించారు. మొదటి పుష్కర ఘాట్ వద్ద రెండు సెల్‌ఫోన్లు, బ్యాగును మరిచిపోయారు. అక్కడే ఉన్న యువకుడు మారుతి గమనించి ప్రకాశ్‌కు బ్యాగు, సెల్‌ఫోన్లు తిరిగి అప్పగించాడు. యువకుడిని స్థానికులు అభినందించారు.